క్లుప్తంగా

సీఎంను కలిసిన 'కొమ్మూరి'



జనగామ: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందగా, బుధవారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. జనగామ నుంచి ఎంపీ చామలకు భారీ మెజార్టీ ఇచ్చిన నాయకులు, కార్యకర్తలను సీఎం అభినందించారు.

సీఎం, ఎంపీని కలిసిన 'నాగపురి'



భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఘన విజయాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, చామలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. భువనగిరి ఇన్‌చార్జ్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి గెలుపు బాధ్యతను తన భుజాలపై వేసుకుని భారీ మెజార్టీతో గెలిపించారన్నారు.

భువనగిరి ఎంపీని కలిసిన జెడ్పీటీసీ



లింగాలఘణపురం: లింగాలఘణపురం మండల జెడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి బుధవారం భువనగిరి ఎంపీగా కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నాయకుడు వంశీకృష్ణ ఉన్నారు.

కావ్యకు అభినందనలు



చిల్పూరు: కాంగ్రెస్ పార్టీ నుంచి వరంగల్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలిచిన కడియం కావ్యను మంగళవారం రాత్రి చిల్పూరు ఆలయ శాశ్వత దాత పొల్లపల్లి శ్రీధర్‌రావు, పల్లగుట్ట గ్రామానికి చెందిన పీహెచ్‌డీ స్కాలర్ డాక్టర్ చిర్ర సుమన్‌లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిశారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ మండల పూజ



దేవరుప్పుల: మండల కేంద్రం నామకరణ ప్రతీకైన భ్రమరాంభమల్లికార్జునస్వామి ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ పురస్కరించుకుని 41వ రోజు మండల పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారీ పెద్దాపురం వెంకటేశ్వరశర్మ పర్యవేక్షణలో అభిషేకం పూజలు నిర్వహించారు. సిద్ధాంతి ప్రసాద్ శర్మ, గ్రామ బ్రాహ్మణులు ఉప్పల రమేష్‌శర్మ, ఆలయ అభివృద్ధి నిర్వహాక ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని పూజలు

చిల్పూరు: వర్షాలు కురవాలని ఫత్తేపూర్ బండలగట్టు శివగంగపార్వతిపరమేశ్వరుడి ఆలయంలో బుధవారం ఆలయ నిర్మాణ దాత, పూజారి వేల్పుల లక్ష్మీగట్టయ్య ఆధ్వర్యంలో భక్తులు జలాభి షేకం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీగట్టయ్య మాట్లాడుతూ ఇక్కడి శివలింగానికి జలాభిషేకం చేస్తే ప్రతీ ఏడు వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని అన్నారు.

'ప్రభుత్వ చిహ్నం మార్పును స్వాగతిస్తున్నాం'

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ చిహ్నాన్ని మార్పు చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు నాగిళ్ల కిష్టయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నయాబ్ తహసీల్దార్ ఖాసీమ్‌కు పలు సూచనలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన చిహ్నంలో అంబేద్కర్, పండుగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్న, సమ్మక్క–సారలమ్మ చిత్రాలను కూడా ఉంచాలని అన్నారు. ప్రభుత్వ చిహ్నంలో ఈ చిత్రాలను ముద్రిస్తే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేసినట్లు అవుతుందన్నారు.

సంతాపం

బచ్చన్నపేట: మండల కేంద్రానికి చెందిన కోడూరి శ్రీనివాస్ (35) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. కాగా, శ్రీనివాస్ మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం తెలిపారు. మృతుడు సామిల్ నడుపుకుంటూ జీవించేవాడు. మృతుడికి భార్య రవళి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



స్టేషన్‌ఘన్‌పూర్: ర్యాలీలో డీఎంహెచ్ఓ, తదితరులు



కొడకండ్ల: మొక్క నాటుతున్న నాగశేషాద్రిసూరి



చిల్పూరు: ర్యాలీ తీస్తున్న అధికారులు, సిబ్బంది



లింగాలఘణపురం: పాఠశాల ఆవరణలో..

స్టేషన్‌ఘన్‌పూర్: పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతీ ఒక్కరూ తమవంతు బాధ్యతగా పాటుపడాలని డీఎంహెచ్ఓ డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్) వైద్యులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ సాంబయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్ఓ మాట్లాడారు. రోజురోజుకు పెరుగుతున్న వాతావరణ కాలుష్యంతో పర్యావరణం దెబ్బతింటుందని, తద్వారా కీటక జనిత వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే భూతాపం బాగా పెరిగిందని, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు చెట్లను పెంచడం, అడవులను రక్షించుకోవడం తదితర కార్యక్రమాలను విరివిగా చేపట్టాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధీర్, వైద్యులు డాక్టర్ జనార్దన్, డాక్టర్ సంధ్య, డాక్టర్ ప్రసన్నక్రిష్ణ, అజయ్, ప్రోగ్రాం ఆఫీసర్ ప్రభాకర్, కె.హరిప్రసాద్‌తో పాటు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొడకండ్లలో..

కొడకండ్ల: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండలకేంద్రంలోని నాగులమ్మ కుంట అమృత సరోవరం కట్టపై ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ చెట్ల నరికివేత, ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం దెబ్బతింటుందని, ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, మొక్కలను పెద్ద ఎత్తున పెంచడం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చని అన్నారు. ఎపీఓ కుమారస్వామి, టీఏ యాకయ్య, కార్యదర్శి శ్రీనివాస్, ఎఫ్ఏ సురేష్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

లింగాలఘణపురంలో..

లింగాలఘణపురం: పర్యావరణ కాలుష్య నివారణకు మొక్కలు పెంచడమే ఏకైక మార్గమని స్పెషల్ ఆఫీసర్, ఎంపీఓ మల్లికార్జున్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో లింగాలఘణపురం–పటేల్‌గూడెం రోడ్డుకు ఇరువవైపులా మొక్కలను నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, టీఏ కనకయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఫీల్డ్‌అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో..

మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఏర్పాటై బుధవారంతో 67 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పూర్వవిద్యార్థుల ఐక్యవేదిక కన్వీనర్ చెన్నూరి మల్లేశం ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీటీసీ భిక్షపతి, బీఆర్ఎస్ నాయకుడు రాజు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఐక్య వేదిక ప్రతినిధులు వీరయ్య, మురళి, ఉపేందర్, రమేష్, శ్రీధర్, భాగ్యలక్ష్మి, అనిల్ పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని అన్ని గ్రామాల్లో మొక్కలను నాటాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ స్థలాల్లో, రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలను నాటడానికి వన నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేశామని తెలిపారు. జీపీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఆశలు పాల్గొన్నారు.



బచ్చన్నపేట: మొక్కలు నాటిస్తున్న భరత్‌కుమార్

పర్యావరణాన్ని పరిరక్షించాలి

తరిగొప్పుల: పర్యావరణాన్ని రక్షిస్తే మనకు మేలు చేస్తుందని, అందుకే అధిక సంఖ్యలో మొక్కలను నాటాలని మండలంలోని అబ్దుల్ నాగారం గ్రామ పంచాయతీ కార్యదర్శి భూక్య లింగం అన్నారు. బుధవారం జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో పలు ప్రదేశాల్లో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశలు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

విధిగా మొక్కలు నాటాలి

చిల్పూరు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ఎంపీఓ మధుసూదన్, గ్రామ ప్రత్యేకాధికారి డీటీ విమల పిలుపునిచ్చారు. మండలంలోని పల్లగుట్ట గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అవగాహన ర్యాలీని పంచాయతీ కార్యదర్శి బాపునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమృత్ సరోవర్ ట్యాంకు చెరువు కట్టపై మొక్కలు నాటారు. జీడీ ఆనందం, వెంకట్రాజం, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ యాకరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

పాలకుర్తి : మొక్కలు, చెట్లు మానవ మనుగడకు జీవనాధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీడీఓ రాములు అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఎంపీడీఓ మొక్కలు నాటారు. ఎల్లరాయని తొర్రూరు గ్రామంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిప్యూటి ఈఈ కె. సంధ్య మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. జీపీ కార్యదర్శి వెంకటాచారి, ఈజీఎస్ ఏపీఓ మంజుల, ఏపీఓ కుమార్, టి.ఏ కుమార్, ఎఫ్ఏ పబ్బతి కుమార్, ఎల్లరాయని తొర్రూరు గ్రామ పంచాయతి కార్యదర్శి మహేష్, ఈజీఎస్ టీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పంచాయతీ కార్యదర్శి శైలజ కోరారు. మండలంలోని సూరారం గ్రామంలో గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేయడంతో పాటు పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



జఫర్‌గఢ్: సూరారంలో..



పాలకుర్తిలో..



తరిగొప్పుల: మొక్కలు నాటుతున్న లింగం తదితరులు



లింగాలఘణపురం: ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజలకు కృతజ్ఞతలు

రఘునాథపల్లి: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు ఓట్లు వేసి గెలిపించిన పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు కాంగ్రెస్ జిల్లా మహిళా కార్యదర్శి పోరెడ్డి లక్ష్మీప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నారన్నారు. అందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ ఎనిమిది ఎంపీ స్థానాల్లో విజయం సాధించిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ వంద శాతం ఫలితాలు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ ఎంపీగా గెలుపొందిన కడియం కావ్యకు ఆమె అభినందనలు తెలిపారు.

బస్‌షెల్టర్ నిర్మాణ పనులు ప్రారంభం



రఘునాథపల్లి: మండలంలోని వెల్ది మోడల్ స్కూల్ వద్ద బస్ షెల్టర్ నిర్మాణ శ్రీకారం చుట్టారు. బుధవారం బస్‌షెల్టర్ నిర్మాణ దాత గుర్రాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బస్‌షెల్టర్ లేక విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. బస్‌షెల్టర్ నిర్మాణానికి ముందుకు వచ్చిన దాత లక్ష్మణ్‌ను ఆయన అభినందించారు. పీఈటీ రాజన్న, యాకన్న, దిలీప్‌రెడ్డి, వెంకన్న, రాజు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం అంగన్ వాడీ కేంద్రాల తనిఖీలో భాగంగా రికార్డులను పరిశీలించారు. ఈ సదర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని అంగన్‌వాడీ టీచర్లు నెరవేర్చాలని, కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం మరింత పెంచాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టిన ప్రజలు



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి



జఫర్‌గఢ్: సంబురాల్లో నాయకులు, కార్యకర్తలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి ప్రధాత కడియం శ్రీహరిపై ఎంతో నమ్మకం ఉందని, అభివృద్ధికి, పనితనానికి పట్టం కట్టారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ చింతకుంట్ల నరేందర్‌రెడ్డి అన్నారు. వరంగల్ ఎంపీగా డాక్టర్ కడియం కావ్య భారీ మెజార్టీతో విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. స్థానిక బస్టాండ్ వద్ద, గాంధీ సెంటర్ వద్ద, ఎస్సీ కాలనీలో బాణాసంచాలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. జిల్లా నాయకుడు కొలిపాక సతీష్, కడియం యువసేన మండల అధ్యక్షుడు జీడి ప్రసాద్, నాయకులు అంబటి కిషన్‌రాజ్, రవి, రమేష్, యాదగిరి, జాకబ్, బాబు, జోసెఫ్, చింటు తదితరులు పాల్గొన్నారు.

కడియం కావ్య గెలుపుపై హర్షం

జఫర్‌గఢ్: వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్య విజయం సాధించడం పట్ల కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ సంబురాలను నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు అన్నం బ్రహ్మారెడ్డి, అన్నెబోయిన భిక్షపతి, మంచాల ఎల్లయ్య, తీగల కర్ణాకర్‌రావు, బానోత్ రాజేష్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య, ఎంపీపీ రడపాక సుదర్శన్, ఇల్లందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నర్మెట: మండలకేంద్రానికి చెందిన నిమ్మకంటి నర్సమ్మ (75) అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి సూచనలతో పార్టీ శ్రేణులు బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సరుకులను అందజేశారు. టౌన్ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, మండల మహిళా అధ్యక్షురాలు దేవులపల్లి భాగ్యలక్ష్మి, యూత్ అధ్యక్షుడు పల్లె ప్రభుదాస్, టౌన్ ఉపాధ్యక్షుడు కొన్నె తిరుపతి తదితరులు ఉన్నారు

రైలుకింద పడి మహిళ ఆత్మహత్య

జనగామ రూరల్ : అనారోగ్య సమస్యలు తాళలేక ఓ మహిళ జనగామ రైల్వే స్టేషన్ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఆర్.రమణారెడ్డి, పీసీసీహెచ్ నరేష్ తెలిపిన కథనం ప్రకారం.. పాలకుర్తి మండలం సరిసన్నగూడేనికి చెందిన ఆవుల స్వప్న (44) కొన్ని రోజుల నుంచి అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. కాగా మంగళవారం రాత్రి జనగామ సమీపంలో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

ముగ్గురి రిమాండ్

రఘునాథపల్లి: మండలంలోని ఆంధ్రతండా శివారులో దారి వివాదంలో ఓ మహిళా రైతు మృతి చెందిన కేసులో ముగ్గురిని రిమాండ్ చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ బుధవారం తెలిపారు. మంగళవారం తండాకు చెందిన ధరావత్ బీల్యా, శినాద్రిలు వారి భూములకు వెళ్లేందుకు దారి కోసం మట్టి పోసుకుంటున్నారు. వారి భూమి పక్కనే ఉన్న భూక్య గణేష్, అతని భార్య మంగమ్మ (45)లు అక్కడకు వెళ్లి మీకు దారి లేదని అడ్డుకున్నారు. ఈ క్రమంలో బీల్యా కుమారుడు రవీందర్, శినాద్రి, అతడి భార్య కాళీ ముగ్గురు మంగమ్మను నెట్టివేయడంతో కిందపడింది. అదే సమయంలో బీల్యా ట్రాక్టర్‌లోని మట్టిని పోస్తుండగా ప్రమాదశాత్తు మంగమ్మ మీద ట్రాలీ పడి మృతి చెందింది. మంగమ్మ మృతికి కారుకులైన బీల్యా, శినాద్రి, కాళీలను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, బీల్యా కుమారుడు రవీందర్ పరారిలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

65 ఏళ్ల తర్వాత మూడోసారి పట్టం

జనగామ: దేశంలో 1960 తర్వాత...ఆరున్నర దశాబ్దాల సుదీర్ఘ కాలం తర్వాత కేంద్రంలో బీజేపీకి వరుసగా మూడోసారి ప్రజలు పట్టం కట్టారని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ మూడోసారి దేశ ప్రధానిగా మోదీని ఆదరించిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. నరేంద్ర మోదీ ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలతో కలిసి దేశ అభివృద్ధిలో భారత్‌ను అగ్రభాగాన నిలిపారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి 8 పార్లమెంట్ స్థానాలు రావడం చారిత్రాత్మకమన్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని జనగామ నియోజకవర్గంలో బీజేపీ సుమారు 45 వేల ఓట్లు సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. ఈ నియోజకవర్గంలో ఒకప్పుడు పట్టణ ప్రాంతాలకే పరిమితమైన పార్టీ, నేడు బచ్చన్నపేట, తరిగొప్పుల, నర్మెట, చేర్యాల తదితర ప్రాంతాల్లో భారీగా ఓటు బ్యాంకును సాధించి రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి చెమటలు పట్టించారన్నారు. బీజేపీకి రోజురోజుకు ఆదరణ పెరగడానికి కారణం బూత్ స్థాయిలో జెండా మోసిన కార్యకర్తల శ్రమ ఫలితమే అన్నారు. బీజేపీ పార్టీ ఒక్కో కార్యకర్త 100 ఓటర్లతో సమానమన్నారు.

ఆర్థికసాయం

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ గ్రామానికి చెందిన కోమటి రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల సాయం గురువారం అందజేశారు. భిక్షపతి, ఎల్లయ్య, మోహన్‌రావు, ఎంపీటీసీలు జ్యోతి రజిత యాకయ్య, స్రవంతి మొగిళి, నర్సింగం ఉన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

నిరుపయోగంగా సొసైటీ భవనం

- మరుగుదొడ్లకు నిలయంగా గదులు
- పట్టించుకోని అధికారులు
- వినియోగంలోకి తేవాలంటున్న ప్రజలు



చిల్పూరులోని సొసైటీ భవనం

చిల్పూరు: మండల కేంద్రం ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వ కార్యాలయాలు అరకొర వసతులు ఉన్న అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కార్యాలయాలకు అనువుగా ఉండే సొసైటీ భవనం నిరుపయోగంగా ఉండటంతో శిథిలావస్థకు చేరుతోంది. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఈ భవనాన్ని వినియోగంలోకి తెస్తే అందరికి ఉపయోగంగా ఉంటుందని ప్రజలు అంటున్నారు... ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వెనుకాల వాగు సమీపంలో 600 గజాల స్థలంలో 30 ఏళ్ల క్రితం రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు విశాలంగా నిర్మించిన సొసైటీ గోదాం భవనం వృథాగా ఉంటోంది. చుట్టు పక్కల ఎవరూ లేక పోవడంతో ప్రస్తుతం విలువైన భవనంలోని గదులు మరుగదొడ్లకు నిలయంగా మారాయి. అప్పట్లో రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకోవడమే కాకుండా సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా స్టేషన్‌ఘన్‌పూర్ కోఆపరేటివ్ సొసైటీ వారు భవనాన్ని నిర్మించారు. అప్పటి నుంచి 15 ఏళ్ల పాటు అందులో రైతుల సమావేశాలు, ధాన్యం నిల్వ చేశారు. రానురాను భవనాకి వెళ్లే దారి గుంతలమయం కావడం, వాగు నీటితో కోతకు గురవడంతో అక్కడికి వెళ్లడం మానేశారు. కొద్ది నెలల పాటు కాపలాగా ఒకవ్యక్తిని ఏర్పాటు చేయగా అతనికి జీతం ఇవ్వక పోవడంతో మానేశాడు. దీంతో వృథాగా ఉంటోంది. భవనానికి ఉన్న చెక్క తలుపులు, కిటికీలను గుర్తుతెలియని వారు ఎత్తుకెళ్లారు. ప్రస్తుతం గ్రామస్తులకు మరుగుదొడ్డిగా మారిపోయింది.


భవనాన్ని వినియోగంలోకి తేవాలి..



30 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం నేటికి చెక్కుచెదలేదు. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలు అద్దె గదుల్లో నడుస్తున్నాయి. అందుకు అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలి.

- వెలిశాల శ్రీనివాస్, స్థానికుడు

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా..



మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. వృథాగా ఉంటున్న సొసైటీ భవనాన్ని వినియోగం లోకి తెచ్చే విధంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుక్తా. భవనం మరమ్మతుకు నిధులు మంజూరు చేస్తే వినియోగంలోకి తీసుకొస్తాం.

-బొమ్మిశెట్టి సరిత, ఎంపీపీ

బోరు మోటార్ల కేబుల్ చోరీ

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ సమీపంలో ఎడ్ల మల్లేషం అనే రైతుకు చెందిన రెండు వ్యవసాయ బోరు మోటర్ల కేబుల్‌ను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. ఈ మేరకు బాధితుడు మల్లేశం బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్టార్టర్ల నుంచి బోరు మోటర్ల వరకు కేబుల్ వైరు దొంగలించడంతో.. మోటర్లను పైకి తీసి తిరిగి కొత్త కేబుల్ వైరు వేసుకునేందుకు ఒక్కో బోరుకు రూ.5 వేల వరకు ఖర్చవుతుందని, దుండగులను గుర్తించి న్యాయం చేయాలని ఫిర్యాదులో బాధితుడు కోరారు.

పార్లమెంట్ ఎన్నికల్లోనూ పాలకుర్తి 'హస్త'గతం

- కమలానికి క్రాసైన గులాబీ ఓట్లు
- పుంజుకున్న బీజేపీ, ప్రాబల్యం తగ్గని బీఆర్ఎస్
- ఎట్టకేలకు కడియం కావ్యకు ఆధిక్యత

దేవరుప్పుల/తొర్రూరు: పార్లమెంట్ ఎన్నికల్లో గత అసెంబ్లీ ఎన్నికలకు తీసిపోకుండా కాంగ్రెస్‌కు కొంత మెజారిటీ తగ్గినా తిరిగి పాలకుర్తి హస్తగతం అయ్యింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై కాంగ్రెస్ తరపున పోటీ చేసిన మామిడాల యశస్విరెడ్డి 46 వేల 367 మెజార్టీతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆర్నెళ్లుగా నియోజకవర్గంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో బీఆర్ఎస్ తిరిగి పుంజుకుందన్న సంకేతాలు మాత్రం ఎన్నికల ఫలితాలతో సరిపోలేదు. కాగా కాంగ్రెస్‌కు ప్రజలు యదావిధిగా మెజార్టీ ఇచ్చారని చెప్పాక తప్పదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 2 లక్షల 14 వేల 508 ఓట్లు పోలవగా కాంగ్రెస్‌కు లక్షా 24 వేల 234, బీఆర్ఎస్‌కు 77 వేల 867 ఓట్లు నమోదయ్యాయి. ఎంపీ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గంలో లక్షా 82 వేల 515 ఓట్లు పోలవగా కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు 86 వేల 978, బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపెల్లి సుధీర్‌కుమార్‌కు 47 వేల 775 ఓట్లు, బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్‌కు క్రాస్ ఓటింగ్‌తో 28 వేల 222 ఓట్లు పోలయ్యాయి. ఇలా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోలైన ఓట్ల దామాషా తతంగంతో బీజేపీకి పడిన ఓట్లలో 25 వేలు బీఆర్ఎస్ నుంచి క్రాస్ అయ్యాయని, వీటిని కలిపితే కాంగ్రెస్‌కు వచ్చింది ఈసారి 20 వేల మెజార్టీ మాత్రమేనని, వరంగల్ ఎంపీ నియోజకవర్గాల్లోని పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రాబల్యం తగ్గలేదనీ ఆ పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఓటింగ్ శాతాన్ని పరిశీలిస్తే పలు మండలాల్లో మెజార్టీ తగ్గినా ఫలితాల్లో వచ్చిన మెజార్టీ తమ ఆధిక్యతకు నిదర్శనంగా నిలుస్తోందని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. ఎంపీ ఎన్నికల్లో పుంజుకున్న బీజేపీ త్వరలోనే జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మరింత ఆధిక్యత సాధించనుందన్న సంకేతాలు విదితమవుతున్నాయి.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

రఘునాథపల్లి: పేదలందరికీ ఇళ్ల స్థలాలు అందజేసి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాపురం మహేందర్ డిమాండ్ చేశారు. బుధవారం ఎల్లారెడ్డిగూడెంలో సంఘం నాయకులతో కలిసి ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయడంతోపాటు పని దినాలు పెంచాలని, కూలీలకు పే స్లిప్పులు, రోజువారీ వేతనం రూ.800, రూ.5 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి నేడు తలపెట్టిన 'చలో కలెక్టరేట్'కు కూలీలు తరలి రావాలని పిలుపునిచ్చారు. మల్లారెడ్డి, ఎల్లయ్య, నర్సయ్య, ఉప్పలయ్య, రాములు, ప్రేమలత, రుక్కమ్మ, ధనలక్ష్మి, కమలమ్మ, శోభ, నాగలక్ష్మి, నర్సింగం పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న మహేందర్

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కె. మల్లేష్ (S.R) : 9849921793 (పాలకుర్తి)
యం.డి. ఖలీల్ (S.R) : 8179719313 (జనగామ)
జి. రవియాదవ్ (A.C.O) : 9032782191